క్లుప్తంగా

గ్రామ దేవతలకు శ్రావణ పట్టీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో కొలువై ఉన్న గ్రామ దేవతలకు శ్రావణ పట్టీ సమర్పించారు. శ్రావణమాసం సందర్భంగా శుక్రవారాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా చేపట్టిన ఈవినూత్న కార్యక్రమానికి గ్రామాల్లో భక్తులు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలో మొత్తం 201 గ్రామ దేవతల ఆలయాలకు ఈ పట్టీ సమర్పించారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారి ప్రచార రథానికి ఎదురేగి స్వాగతం పలికారు.

రూ.1.20 లక్షలు గృహ రుణమాఫీ పత్రం అందజేత

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 6 వ వార్డు కాకానినగర్‌కు చెందిన దివ్యాంగురాలు క్రోసూరు మాధవికి గృహ రుణమాఫీ కింద సుమారు రూ.1.20 లక్షలు మాఫీ అయ్యాయి. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ గృహ రుణమాఫీ పత్రాన్ని ఆమెకు అందజేశారు. లబ్ధిదారు మాధవి మాట్లాడుతూ తమకు గృహ రుణ మాఫీ అయినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన యాదమరెడ్డి హరికృష్ణ ప్రసాద్, కృష్ణజ్యోతి దంపతులు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నూతన పింఛన్లు పంపిణీ

నందిగామ: పట్టణంలోని తొమ్మిదవ సచివాలయ పరిధిలో 14 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం 18 వ వార్డు కౌన్సిలర్ బండారు గంగమ్మ, జిల్లా బీసీ నాయకుడు బండారు వెంకటరావు అందజేశారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: మండల పరిధిలో గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ దిబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టీడీపీ రాస్తారోకోతో ప్రయాణికుల అవస్థలు

దాదాపు గంటపాటు నిలిచిపోయిన ట్రాఫిక్



జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద శనివారం రాత్రి 11 గంటల సమయంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రోడ్డుపై బైఠాయించడంతో జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

నందిగామ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నందిగామలో జాతీయ రహదారిపై టీడీపీ నాయకులు రాస్తారోకో చేయడంతో దాదాపు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును అరెస్టు చేసినందుకు నిరసగా టీడీపీ నాయకులు పట్టణ శివారు అంబారుపేట వై.జంక్షన్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. దీంతో విజయవాడ, హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీనికి తోడు ఎండ అధికంగా ఉండడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. పోలీసులు ఎంత చెప్పినా వినకపోవడంతో ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని అంబారుపేట, మునగచర్ల వద్ద జాతీయ రహదారిపై కూడా టీడీపీ నాయకులు ఆందోళనలు చేశారు. మండలంలోని రామిరెడ్డిపల్లి,జొన్నలగడ్డ గ్రామాల్లో కూడా టీడీపీ నాయకులు నందిగామ–మధిర రహదారిపై నిరసన తెలపగా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట: అవినీతి కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం మండలంలోని షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు, పెనుగంచిప్రోలు మండలం కొణకంచి అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కొందరు నాయకులు అత్యుత్సాహంతో టైర్లు తగలబెడుతూ బీభత్సం సృష్టించటంతో హైదరాబాద్–విజయవాడ రహదారిపై ప్రయాణికులు పలు ఇబ్బందులు పడ్డారు. వెంకటసాయి ఫుడ్ ప్లాజా వద్ద బండిపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు కార్యకర్తలను రెచ్చగొడుతూ రాస్తారోకో చేయటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారిని చెదరగొట్టారు. వత్సవాయి మండలంలో ఖమ్మం– జగ్గయ్యపేట రహదారిపై రాస్తారోకోతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో సీఐడీ అధికారులు శనివారం అరెస్టు చేసిన నేపథ్యంలో కంచికచర్లలో టీడీపీ నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వెంటనే స్పందించిన నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా పోలీస్ సిబ్బందితో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గరికపాడులో హైటెన్షన్

జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

నేడు ఎన్టీఆర్ ఆత్మ శాంతించిన రోజు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ఇప్పటివరకు పలు కేసుల్లో స్టేలు తెచ్చుకొని పబ్బం గడుపుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఇక స్టేలు తెచ్చుకొనే సీజన్ పోయిందని, ఆయన పాపం పండిందని, ఇక ఆయన్ను కాపాడే వారు ఎవరూ లేరని ప్రభుత్వ విప్, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. నిజంగా నేడు ఎన్టీ రామారావు ఆత్మ శాంతించిన రోజు అని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేటలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఉదయభాను విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ విభాగానికి సంబంధించిన స్కామ్‌లో ప్రభుత్వానికి రూ.371 కోట్లు నష్టం కలిగించిన ఏ–1 నిందితుడు చంద్రబాబు అని అన్నారు. ఇది కక్ష సాధింపు చర్య కాదన్నారు. పాపం పండి రాష్ట్రంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయని, వారిని ఎవరూ కాపాడలేరని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన ఎవరిపైన అయినా చట్టం ఇటువంటి చర్యలే తీసుకుంటుందన్నారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు

నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: చట్టానికి ఎవరూ అతీతులు కాదని, చట్టం ముందు అందరూ ఒక్కటేనని నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే మంచి పేరున్న సీమెన్స్ కంపెనీకి ఎటువంటి సంబంధం లేకుండా ఆ కంపెనీ పేరుతో వందల కోట్లు కాజేయటం ఒక్క చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఎవరు ఏ పని చేసినా పారదర్శకంగా చేయాలని, పారదర్శకత లోపిస్తే వచ్చే సమస్యలే చంద్రబాబుకు వచ్చాయని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఇమ్మంటేనే డబ్బులిచ్చామని నోట్‌ఫైల్ మీదనే రాశారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారనటానికి ఎటువంటి ఆస్కారం లేదన్నారు. దీనికి సంబంధించి షెల్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారు.. నిధులు ఎలా మళ్లించారు అనే విషయాలను అసెంబ్లీ సాక్షిగా పూర్తి స్థాయిలో చర్చించినట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రభుత్వానికి రూ.371 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, సమగ్ర విచారణ తరువాతనే చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్‌ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

అరెస్ట్ అక్రమం కాదు..సక్రమమే



చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని టీడీపీ నాయకులు అనడం సిగ్గుచేటు. ఇది సానుభూతి కోసం చేసే ప్రయత్నమే. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో దొరికిపోవడంతోనే ఆయనను అరెస్ట్ చేశారు.

–తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్

ఇది కక్ష సాధింపు చర్య కాదు



చంద్రబాబును కక్ష సాధింపు చర్యగా అరెస్ట్ చేశారనడం హాస్యాస్పదం.చట్టం ముందు అందరూ సమానులే. దీనిలో ఆయనపై ఎవరూ కక్ష సాధింపునకు పాల్పడలేదు.

–రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ చైర్మన్, జగ్గయ్యపేట

తండ్రీ కొడుకులిద్దరి పాపం పండింది



చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ పాపం పండింది. ఇంత కాలం చట్టాలను మేనేజ్ చేసుకుంటూ వచ్చిన చంద్రబాబుకు కాలం ఎప్పుడూ కలిసి వస్తుంది అనుకోవడం పొరపాటు. ఇక చట్టం నుంచి వారిని ఎవరూ తప్పించలేరు.

–తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్, జగ్గయ్యపేట

నిజాయితీ నిరూపించుకోవాలి



ఆధారాలుండటంతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారు. చట్టం ఎవరికీ చుట్టం కాదు. సీఐడీ అధికారులు గత మూడేళ్లుగా కేసును విచారించిన అనంతరమే ఏ1గా చంద్రబాబును చేర్చారు. చంద్రబాబు తన నిజాయితీని కోర్టులో నిరూపించుకోవాలి.

– మండవ శ్రీనివాస్ గౌడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జగ్గయ్యపేట

తప్పు చేయకపోతే భయం ఎందుకు?



తప్పు చేయకపోతే చంద్రబాబుకు భయం ఎందుకు. కచ్చితమైన ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేసినట్టు తెలుస్తోంది.

– మహమ్మద్ మస్తాన్, ఏఎంసీ చైర్మన్, నందిగామ

తప్పు చేశారు కాబట్టే అరెస్టు చేశారు



చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకొని తప్పు చేశారు కాబట్టే సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు ఆధారాలు ఆధారాలతో సహా బయట పెట్టినా కూడా తప్పు చేయలేదు అని చెప్పటం హాస్యాస్పదం.

– బండారు వెంకట్రావు, బీసీ సంఘ జిల్లా నాయకులు

అన్ని ఆధారాలతోనే అరెస్ట్ చేశారు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును స్కిల్ డెవలప్ స్కాంలో అన్ని ఆధారాలతో అరెస్ట్ చేశారు. ఇందులో ఎటువంటి రాజకీయ కక్ష సాధింపునకు ఆస్కారం లేదు.

– మానేపల్లి బ్రహ్మం, ఏఎంసీ ఇన్‌చార్జ్ చైర్మన్, జగ్గయ్యపేట

ప్రజాధనాన్ని దోచారు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు నాయుడు ప్రజాధనాన్ని దోచేసుకున్నారు. యువతకు స్కిల్ శిక్షణ పేరుతో రూ.371 కోట్ల ప్రభుత్వ నిధులను తన షెల్ కంపెనీలకు మళ్లించి సొమ్ము చేసుకున్నారు. ఈ కేసులో ఆయన్ను అరెస్టు చేయడంలో తప్పేమీ లేదు.

– మాతంగి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ

చట్ట ప్రకారమే చంద్రబాబు అరెస్ట్



సీఐడీ అధికారులు చట్ట ప్రకారమే చంద్రబాబును అరెస్ట్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇచ్చేందుకు వినియోగించాల్సిన నగదును చంద్రబాబు అక్రమంగా కాజేశారు.

– ముక్కపాటి నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు, చందర్లపాడు

నిప్పు కాదు తుప్పు అని రుజువైంది



ఇప్పటివరకు పలు కేసుల్లో స్టేలు తెచ్చుకుని పబ్బం గడుపుతున్న చంద్రబాబు ఇప్పుడు సీఐడీ అధికారులకు అడ్డంగా దొరికాడు. బాబు నిప్పు కాదు తుప్పు అని రుజువైందన్నారు.

–కనకపూడి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు,పెనుగంచిప్రోలు

ఎన్టీఆర్ ఆత్మకు నేడు శాంతి



అవినీతి చక్రవర్తి చంద్రబాబు అరెస్ట్‌తో ఎన్టీఆర్ ఆత్మకు నేడు శాంతి చేకూరింది. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుకు నేడు పాపం పండింది.

–బత్తుల రామారావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన చంద్రబాబును అరెస్ట్ చేయటం సక్రమమే. చట్టం ముందు అందరూ సమానులే.

–చేని కుమారి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్

చట్టానికి అందరూ సమానమే



చట్టానికి అందరూ సమానమే. తప్పు చేస్తే ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుపై సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతోనే కేసు నమోదు చేశారు. తప్పు చేయకపోతే నిర్దోషిగా బయటపడవచ్చు.

– మంగునూరు కొండారెడ్డి, రాష్ట్ర ఆగ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్

ప్రధాన సూత్రధారి చంద్రబాబే



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు ప్రధాన సూత్రధారి. సీఐడీ అధికారులు అన్ని రకాలుగా దర్యాప్తు చేసిన తరువాతనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేశారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమం కాదు అనివార్యం.

– కోటేరు లక్ష్మి, ఎంపీపీ, వీరులపాడు

చంద్రబాబు సచ్ఛీలుడేం కాదు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచ్ఛీలుడేం కాదు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేటాయించిన నిధులను తన జేబులోకి మళ్లించుకున్న ఆర్థిక తీవ్రవాది.

– ఆవుల రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వీరులపాడు

పాపం పండింది.. అరెస్ట్ చేశారు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాపం ఇప్పటికి పండింది. కుంభకోణంలో చంద్రబాబు కీలక పాత్ర కాబట్టే సీఐడీ అరెస్ట్ చేసింది. న్యాయస్థానంలో చంద్రబాబు తన నిజాయితీని నిరూపించుకోవాలి.

– షేక్ నాగుల్‌మీరా, వైస్ ఎంపీపీ, జుజ్జూరు

చేసిన పాపం ఊరికే పోదు



చేసిన పాపం ఊరికే పోదు. చంద్రబాబు నేరం చేశాడు కనుకే తాను అరెస్ట్ అవుతానని ముందే చెప్పాడు. గతంలో ఎన్నో కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది. సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతోనే అరెస్ట్ చేశారు. ఎక్కడా కక్ష సాధింపు అనేది లేదు.

–మార్కపూడి గాంధీ, ఎంపీపీ, పెనుగంచిప్రోలు

లోక్ అదాలత్‌లో 1048 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

నందిగామ: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు కేసులను సత్వరం పరిష్కరించుకోవాలని జిల్లా 16 వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. దీనివల్ల కక్షిదారుల సమయం, సొమ్ము ఆదా అవుతాయన్నారు. ఇరు వర్గాలు రాజీ పడితే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునని, ఒకే రోజులో కేసుకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేసి న్యాయమూర్తులు వి.శ్రీనివాసరావు, వి.లక్ష్మీరాజ్యం, పి.తిరుమలరావు, ఎస్.కె.రియాజ్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 1048 కేసులు పరిష్కారం కాగా, ఆయా కేసుల ద్వారా రూ.84,90,931 నష్టపరిహారాన్ని అందజేశారు.